నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 25 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL

శిక్షణలో సమయపాలన తప్పనిసరి

ఆదిలాబాద్ ఎస్పీ గౌష్‌ఆలం

ఎదులాపురం, ఏప్రిల్ 24 : శిక్షణలో సమయపాలన తప్పని సరని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. స్థానిక జిల్లా శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న వివిధ జిల్లాల నుంచి వచ్చిన 255 మంది కానిస్టేబుళ్ల శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఎస్పీ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుల్ ఆయుధాలపై ఉన్న పరిజ్ఞానాన్ని పరిశీలించారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ అదనపు ఎస్పీ సి.సమయ్‌జాన్‌రావు, ఆర్ఐ ఎస్ ఐలు రాకేశ్, గోపికృష్ణ ఉన్నారు.

ఆయుధాల వాటి సామర్థ్యంన్ని వివరిస్తున్న ఎస్పీ గౌష్‌ఆలం

ఉట్నూర్ విద్యార్థికి రాష్ట్రస్థాయి ర్యాంక్

ఉట్నూర్, ఏప్రిల్ 24 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డివిజన్ కేంద్రానికి చెందిన ఇంటర్ విద్యార్థినికి బుధవారం వెలువడిన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. పట్టణంలోని బాలాజీ ఫొటో స్టూడియో నిర్వాహకుడు ఠాకూర్ విజయ్ సింగ్ కుమార్తె వర్షిత మొదటి నుంచి చదువులో రాణిస్తున్నది. స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంగ్లిష్ మీడియంలో చదివిన ఆమె పదో తరగతి ఫలితాల్లో 9.3 గ్రేడ్ సాధించింది. అనంతరం చదువుపై పట్టుదలను గ్రహించిన తల్లిదండ్రులు ఇంటర్‌ను కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్‌లో చదివించారు. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఏకంగా ఎంపీసీలో 470కి 468 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో చదివి రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించడంతో ఆమెను అభినందిస్తున్నారు. రాష్ట్ర మొదటి ర్యాంక్ సాదించిన వర్షితను నమస్తే తెలంగాణ ఫోన్‌లో సంప్రదించగా.. తాను బాగా చదివి ఐఏఎస్ కావాలనుకుంటున్నట్లు పేర్కొంది.

ఠాగూర్ వర్షిత

బాలికలే టాప్

- ఇంటర్ ఫలితాలను విడుదల చేసిన అధికారులు
- ఆదిలాబాద్ జిల్లా ఫస్టియర్‌లో 9, సెకండియర్‌లో 13వ స్థానం

ఎదులాపురం, ఏప్రిల్ 24 : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను బుధవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం విడుదల చేశారు. గతేడాది 10,12 స్థానాల్లో ఉండగా ఈ యేడాది మొదటి సంవత్సరంలో 9, ద్వితీయ సంవత్సరంలో 13వ స్థానాలను జిల్లా సాధించింది. ప్రతిసారి మాదిరిగానే ఈ యేడాది కూడా బాలికలే పైచేయి సాధించారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా మొదటి సంవత్సరానికి 9,577 మంది పరీక్షలకు హాజరుకాగా 5,860 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలికలు 3,426, బాలురు 2,434 మంది ఉన్నారు. సెకండీయర్‌లో 9,309 మంది పరీక్షలకు హాజరుకాగా 6,165 మంది పాస్ అయ్యారు. ఇందులో బాలికలు 3,595, బాలురు 2,570 మంది ఉన్నారు.

మే 25 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు మంచి ప్రతిభను చాటారని డీఐఈవో రవీందర్ అన్నారు. ఆన్‌లైన్ నుంచి విద్యార్థులు షార్ట్ మెమోలను పొందవచ్చని తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 2వ తేదీ వరకు రీ-వెరిఫికేషన్, రీ-కౌంటింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 25 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

- ప్రథమ సంవత్సరంలో 16వ స్థానం
- ద్వితీయ సంవత్సరంలో 12వ స్థానంలో నిర్మల్ జిల్లా..
- ఒకేషనల్‌లో 27, 28వ స్థానం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 24 : బుధవారం వెలువడిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించినట్లు డీఐఈవో పరశురాం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 6,535 మంది, ద్వితీయ సంవత్సరంలో 6,810 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం రెగ్యులర్ విభాగంలో 5,467 మంది పరీక్ష రాయగా.. 3,064 (56.05 శాతం) మంది ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో 16 వ స్థానంలో నిలిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 5,477 మంది పరీక్షకు హాజరు కాగా.. 3,624 మంది ఉత్తీర్ణత సాధించి 66.17 శాతంతో రాష్ట్ర స్థాయిలో 12వ స్థానంలో నిలిచారు. ఒకేషనల్ కోర్సులో నిర్మల్ జిల్లా నుంచి ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 1,072 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 497(46.36 శాతం) మంది ఉత్తీర్ణత సాధించి ఒకేషనల్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 27వ స్థానంలో నిలిచారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 962 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. 572 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 59.46 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 28వ స్థానంలో నిర్మల్ జిల్లా నిలిచింది.

రాష్ట్రస్థాయిలో మెరిసిన గిరిజన బిడ్డ

- ఫకీర్‌నాయక్ తండాకు చెందిన అంజలి
- నిర్మల్‌లోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కాలేజిలో విద్య

కుభీర్, ఏప్రిల్ 24 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఇంటర్ ఫలితాలను ప్రకటించింది. ఇందులో నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని మారుమూల గిరిజన కుగ్రామమైన(సిర్పెల్లి) ఫకీర్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ అంజలి ఇంటర్ ప్రథమ సంవత్సరం(బైపీసీ)లో 440 మార్కులకు 437 మార్కులు సాధించింది. జిల్లాలో మొదటి స్థానంలో నిలువగా, స్టేట్‌లో రెండో స్థానంలో మెరిసింది. గిరిజన వ్యవసాయ కుటుంబానికి చెందిన రాథోడ్ జయశ్రీ-తానాజీ దంపతుల సంతానమైన రాథోడ్ అంజలి 10వ తరగతి వరకు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల లక్షెట్టిపేట్‌లో చదివింది. టీఎస్ఆర్‌జేసీ ఎంట్రన్స్ ర్రాసి మంచి ర్యాంకు సాధించి తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కాలేజి సోఫీనగర్ నిర్మల్‌లో సీటు సాధించింది. గిరిజన కుగ్రామానికి చెందిన అంజలి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించడంతో సర్పంచ్ పండిత్ జాదవ్, మాజీ సర్పంచ్ గోపీచంద్ జాదవ్, గ్రామస్తులు, మండల గిరిజన నాయకులు అభినందించారు.

తల్లిదండ్రులతో రాథోడ్ అంజలి

నకిలీ విత్తన కంపెనీ ప్రతినిధుల నిర్బంధం

తాంసి, ఏప్రిల్ 24 : ప్రముఖ విత్తన కంపెనీ గాయత్రి సీడ్స్ పేరిట నకిలీ విత్తనాలను విక్రయించిన కంపెనీ ప్రతినిధులను నిర్బంధించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన 50 మంది రైతులు జనవరి, ఫిబ్రవరిలో సోయాబీన్ పంట వేసేందుకు సుమారు 300 బ్యాగులు ప్రముఖ విత్తన కంపెనీ గాయత్రి సీడ్స్‌కు చెందిన విత్తనాలను కొనుగోలు చేశారు. కాగా మొలకెత్తిన విత్తనాలు ఏప్రిల్ వరకు పూత దశలో నుంచి కాత దశకు రాకపోవడంతో సందేహానికి వచ్చిన రైతులు బుధవారం కంపెనీ ప్రతినిధులను పిలిచి నిర్బంధించారు. ఇదిలా ఉండగా తలమడుగు మండలానికి చెందిన ప్రముఖ దళారీ దుకాణంతోపాటు ఇతర దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేశామని ఉద్దేర రూపంలో ఇచ్చారని దళారీ వ్యవస్థతో రైతులను మోసం చేశారని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

డీలర్లను నిర్బంధించిన రైతులు

మీ చేతనైంది చేసుకోండి..

నకిలీ విత్తన కంపెనీ ప్రతినిధులను నిర్బంధించిన గ్రామస్తులు వారిని విచారించగా మాకేం సంబంధం లేదు. డీలర్‌ను పిలిపించండి అంటూ ఏం చేసుకుంటారో చేసుకోండి మీ చేతనైంది చేసుకోండి అంటూ వ్యగ్యంగా విరుచుకుపడ్డారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు వారిని నిర్బంధించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గడువులోగా పూర్తి చేయాలి..

నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 24 : అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పన, మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, స్లాబ్‌ల మరమ్మతు, గ్రిల్స్ ఏర్పాటు, సౌర ఫలకాల ఏర్పాటు, ఇతర మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటికి సంబంధించి రెండు ట్యాప్‌ల ద్వారా ఫిల్టర్ నీటిని అందించాలని అన్నారు. నీటి అవసరాల కోసం అన్ని పాఠశాలల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు తీసుకోవాలని అన్నారు. అవసరమైన పాఠశాలల్లో బోర్లు వేయించాలని చెప్పారు. విద్యుత్ పనుల్లో భాగంగా తరగతి గదుల్లో బోర్డు పైన, కిటికీల దగ్గర రెండు బల్బులు అమర్చాలని చెప్పారు. అలాగే రెండు ఫ్యాన్లు, వరండాలో బల్బు, పాఠశాల బోర్డు వద్ద విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలన్నారు. నిధులు వృథా చేయకుండా అవసరమైన పనులు చేయాలని ఆదేశించారు. కిటికీలు, తలుపులకు మరమ్మతులు ఉంటే చేపట్టాలని, పనుల్లో నాణ్యమైన సామగ్రిని ఉపయోగించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్ రెడ్డి, అధికారులు శంకరయ్య, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

రోజు రిపోర్ట్ చేయాలి..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మీడియా కమిటీ అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల ప్రకటనలపై రోజువారి రిపోర్ట్ చేయాలని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీపీఆర్‌వో విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి అత్రం సక్కు తరపున రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు మూడో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, కిరణ్ కొమ్రేవార్

బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి అత్రం సక్కు తరపున రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు నాలుగో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న రమాదేవి, నాయకులు

నామినేషన్ల హోరు

- ఏడో రోజు 12 నామినేషన్లు దాఖలు
- నేటితో ముగియనున్న గడువు

ఆదిలాబాద్, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఏడో రోజైన బుధవారం నామినేషన్ల జోరు కనిపించింది. ప్రధాన పార్టీలతోపాటు పలువురు 12 నామినేషన్లను దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి అత్రం సక్కు తరపున మూడో సెట్ నామినేషన్ పత్రాలను జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు కిరణ్ కొమ్రేవార్, ఇతర నాయకులతో కలిసి రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు అందజేశారు. నాలుగో సెట్ పత్రాలను బీఆర్ఎస్ మథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యురాలు డాక్టర్ రమాదేవి, ఇతర నాయకులు నాలుగో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. బీజేపీ అభ్యర్థి నగేశ్ ఆదిలాబాద్, నిర్మల్, మథోల్, సిర్పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, మహేశ్వర్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌లతో కలిసి నామినేషన్ వేశారు. ఆ పార్టీకి చెందిన ఇతర నాయకులు మరో మూడు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థి అత్రం సుగుణ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ డమ్మి అభ్యర్థిగా రాథోడ్ రమేశ్, గొండ్వానా దండ కారణ్య పార్టీ అభ్యర్థిగా కొడప వామన్ రావు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నేతావత్ రాందాస్, కుమ్రం ముత్తయ్యలు నామినేషన్‌లు వేశారు. నామినేషన్ల వేయడానికి నేడు(గురువారం) చివరిరోజు కావడంతో అధిక సంఖ్యలో అభ్యర్థులు వచ్చే అవకాశాలున్నాయి. మూడు ప్రధాన పార్టీ అభ్యర్థులతోపాటు ఇండిపెండెంట్‌లు నామినేషన్ వేయడానికి రాగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న నగేశ్, పక్కన బీజేపీ ఎమ్మెల్యేలు

ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థినులు

జైనథ్, ఏప్రిల్ 24 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని సాంగ్వి, మాకోడ గ్రామాలకు చెందిన ఇంటర్ విద్యార్థినులు బుధవారం విడుదలైన ఫలితాల్లో సత్తా చాటి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించారు. సాంగ్వి గ్రామానికి చెందిన తుమ్మల శ్రీనివాస్ రెడ్డి-భాగ్య దంపతుల కూతురు తుమ్మల ద్వితి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 468 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకు సాధించింది. నారాయణ కళాశాల కొల్లూరు బ్రాంచ్ సంగారెడ్డి జిల్లాలో ఇంటర్ చదువుతోంది. అలాగే మాకోడ గ్రామానికి చెందిన తుమ్మల గంగన్న-దివ్య దంపతుల కూతురు తుమ్మల శ్లో బైపీసీ విభాగంలో 440 మార్కులకు 432 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రాణించింది. చైతన్య కళాశాల అమీన్‌పుర హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతోంది.

స్టేట్ ర్యాంకు సాధించిన తుమ్మల ద్వితి, తుమ్మల శ్లోక

గుండేగాం గోడు పట్టదా!

- ఎన్నికల్లో ప్రచారాస్త్రంగానే గుండేగాం
- ఎన్నికలు ముగిశాక కన్నెత్తి చూడని నాయకులు
- సర్వేలు, ప్రతిపాదనలోనే గ్రామం
- మరో నెల రోజుల్లో వర్షాకాలం
- పునరావాసం కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులు

గుండేగాం గ్రామం ముఖచిత్రం

గ్రామంలోకి చొచ్చుకువస్తున్న రంగారావు పల్సికర్ బ్యాక్‌వాటర్

భైంసా టౌన్, ఏప్రిల్ 24 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని గుండేగాం పునరావాసంపై ఏళ్లు గడిచినా సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక ముంపు గ్రామం ఉందన్న సంగతిని పూర్తిగా మరిచిపోయారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సర్వేలు నిర్వహించి సమస్యకు పరిష్కారం లభించిందనేలోగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ అడ్డు వచ్చింది. ఎన్నికలు ముగిశాక బీఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక నేతలు గుండేగాం గ్రామాన్ని గురించి ఒక్కసారైనా ఎక్కడా ప్రస్తావించలేదు. పాత సర్వేలు, అవే ప్రతిపాదనలు మళ్లీ మళ్లీ పంపిస్తున్నా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నిధులైతే రావడం లేదు. 2009 నుంచి పునరావాస సమస్యకు పరిష్కారం దొరుకడం లేదు.

వర్షాకాలంలో పరామర్శలు మామూలే..

యేటా వర్షాకాలం ఆరంభంలో భారీ వర్షాలు కురియగానే గుండేగాంలోకి రంగారావు పల్సికర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ చొచ్చుకురావడం, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు గుండేగాం గ్రామానికి రావడం, పరామర్శించడం పరిపాటిగా మారింది. రాజకీయ పార్టీలు గుండేగాంని ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చుకుంటున్నాయి. సమస్య పరిష్కారానికి మద్దతు ఇస్తున్నట్లు తెలిపి గ్రామస్తులతో ధర్నాలు, రాస్తారోకోలు చేయించి ఎన్నికలు ముగిశాక ఆ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అధికారంలోకి వచ్చాక కూడా పునరావాస సమస్యపై గ్రామస్తులకు భరోసా కల్పించడం లేదు. ఇప్పటికీ పట్టణ సమీపంలో కమలాపూర్ గుట్ట వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లలో తాత్కాలిక ఆవాసం ఏర్పర్చుకుని తమ వృత్తి అయిన వ్యవసాయానికి దూరమై జీవనం సాగిస్తున్నారు. శాశ్వత పరిష్కారానికి వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

సర్వేలు, ప్రతిపాదనలకే పరిమితం

పల్సికర్ రంగారావు ప్రాజెక్టు నిర్మాణంతో గుండేగాం గ్రామం నీట మునిగింది. యేటా వర్షాకాలంలో గ్రామం ముంపునకు గురవుతున్నది. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఊరు మునగదని తేల్చారు. యేటా ప్రాజెక్టు నీటిలో గ్రామం మునిగిపోతున్నది. భారీ వర్షాలు కురిసిన సమయంలో వాగు పరీవాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాల్లో నీరు నిలుస్తున్నది. గ్రామంలో మొత్తం 162 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలకు సంబంధించిన 364 ఎకరాల పంట భూములు కూడా నీట మునుగుతున్నాయి. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా బతుకుతున్న గుండేగాంవాసుల ఇబ్బందులు తీరడం లేదు. ఏళ్లుగా ఈ సమస్య వెంటాడుతున్నా పరిష్కారం దొరకడం లేదు. అధికారులు సర్వేలు చేసి ప్రతిపాదనలు పంపామంటున్నారే తప్పా పరిష్కార మార్గం కనుక్కోవడం లేదు.

కొత్త ప్రభుత్వం కనికరిస్తుందా?

పునరావాసం కోసం గుండేగాం వాసులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు. కొత్త ప్రభుత్వం తమ ఇబ్బందులను తీరుస్తుందని ఎదురుచూస్తున్నారు. పునరావాసం కల్పిస్తే శాశ్వత పరిష్కారం దొరుకుతుందనుకుంటున్నారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునరావాస సమస్యను పూర్తిగా మూలకు పడేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం కనికరించి తమ సమస్యను పరిష్కరించాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.

వర్షాకాలం వస్తుందంటే వణుకు పుడుతోంది..

వర్షాకాలంలో మేము పడే బాధలను తలుచుకుంటేనే భయమేస్తుంది. రంగారావు పల్సికర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముందుగా మా ఇంట్లోకే వస్తాయి. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు అధికారులు సర్వేలు, ప్రతిపాదనల కోసం మా గ్రామానికి వచ్చేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా గ్రామాన్ని పట్టించుకునే నాథుడే లేడు. నాయకులందరూ మా గ్రామం పేరిట రాజకీయం చేసి లబ్ధిపొందుతున్నారే తప్పా.. మా గ్రామ పునరావాస సమస్యను పరిష్కరించడం లేదు. వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చొచ్చుకురావడంతో నిత్యావసరాలు తడిసిపోతున్నాయి.

- పవార్ మిలింద్, గుండేగాం.

వ్యవసాయానికి దూరమైపోతున్నాం..

నాకు తెలిసినప్పటి నుంచి నేను వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నా. గ్రామం నుంచి దూరంగా పట్టణ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలో తాత్కాలికంగా ఉంటున్నాం. సొంత ద్విచక్రవాహనం కూడా లేకపోవడంతో ఇక్కడ నుంచి మా గ్రామానికి వెళ్లి వ్యవసాయం చేసుకోవడానికి తిప్పలు పడుతున్నాం. వర్షాకాలంలో నిల్వ చేసిన నిత్యావసరాలు తడిసి పాడైపోతున్నాయి. దేశానికి అన్నంపెట్టే రైతులైన మేము ఒకపూట తిండి కోసం మానవతావాదులు సరఫరా చేసే నిత్యావసరాలపై ఆధార పడుతున్నాం. ఇప్పుడున్న ప్రభుత్వం గుండేగాం పునరావాస సమస్యను అస్సలు పట్టించుకోవడం లేదు. సర్వేలు, ప్రతిపాదనలు అంటూ కాలయాపన చేయకుండా సమస్యను శాశ్వతంగా, తొందరగా పరిష్కరించాలని కోరుతున్నా.

- పవార్ మోహన్, గుండేగాం.

చాలా సంతోషంగా ఉంది.

నేను నాలుగో తరగతి వరకు గోల్లమాడలోనే చదివిన. గురుకుల పాఠశాలలో సీటు సాధించాలనే లక్ష్యంలో కష్టపడి చదివిన. మాసార్లు రోజు గురుకుల పాఠశాల ప్రవేశం కొరకు నిర్వహించే పరీక్ష ఏలా చదివి ఎలా రాయాలో చెప్పారు. అందువల్లనే మాకు సీటు వచ్చింది. ఐదో తరగతి నుంచి 10 తరగతి వరకు ఉచితంగా గురుకలాల్లో చదివేందుకు సీటు రావడం చాలా సంతోషంగా ఉంది.

- గణన దీపిక, గొల్లమాడ.

ప్రభుత్వ పాఠశాలలో చదివిన..

మాది నిర్మల్ మండలంలోని న్యూపోచంపాడ్. మా ఊరి ప్రభుత్వ పాఠశాలలో మా కూతురు నయశ్రీని నాలుగో తరగతి వరకు చదివించిన. ఐదో తరగతిలో గురుకులాల్లో ప్రవేశం కోసం పరీక్ష రాస్తే నిర్మల్‌లోని సోఫినగర్‌లో సీటు వచ్చింది. ప్రైవేట్‌లో చదివించే ఆర్థిక స్థోమత మాకు లేదు. మా పాపకు మంచి స్కూల్‌లో సీటు రావడం సంతోషంగా ఉంది. గురుకులాలను ఏర్పాటు చేయడం వల్లనే పిల్లలకు పోటీ పరీక్షలంటే తెలిసింది. **- రజిత, పోచంపాడ్.**

గురుకులాల్లో ప్రవేశాలు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 24 : గురుకులాల్లో ప్రవేశాలు ప్రారంభం అయ్యాయి. పోటీ పరీక్ష నెగ్గి తమ పిల్లలకు సీటు రావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాల కొరకు ప్రవేశ పరీక్ష నిర్వహించగా.. ప్రతిభ ఆధారంగా విద్యార్థుల మెరిట్ జాబితాను ప్రభుత్వం మూడు రోజుల క్రితం ప్రకటించింది. ఈ మేరకు గురుకుల పాఠశాలలకు కేటాయిస్తు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సీట్లు సాధించిన విద్యార్థులు మే 2వ తేదీలోపు పాఠశాలలో ప్రవేశం రిపోట్ చేయాలని సూచించింది. దీంలో సీటు సాధించిన విద్యార్థులు ఆయా పాఠశాలకు వెళ్లి తాము ప్రవేశం తీసుకుంటున్నట్లు రిపోర్ట్ చేస్తున్నారు. యేటా మే చివరి వారంలో ప్రవేశాలు పొందగా..ఈసారి నెల రోజుల ముందుగానే ప్రక్రియను ప్రారంభించారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగకుండా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే పోటీ పరీక్షలో ప్రతిభ సాధించిన విద్యార్థులు తమకు సీటు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గురుకులాల్లో నాణ్యమైన ఇంగ్లిష్ విద్య, మంచి భోజనం, ఇతర సదుపాయాలు ఉండడంతో సీటు వచ్చిన పేద విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థులు

మే 2 లోపు ప్రవేశం పొందాలి..

- గంగా శంకర్, ప్రిన్సిపల్.

గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాల జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. ఆయా పాఠశాలల జాబితాను పంపి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ప్రతిభ ఆధారంగా సీట్లు రిజర్వేషన్ కేటాయించాం. సీటు పొందిన విద్యార్థులు మే 2 లోపు అన్ని పత్రాలతో రిపోర్ట్ చేయాలి. గురుకులాల్లో నాణ్యమైన ఆంగ్ల బోధన, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాం.